క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులు సోమవారం అందజేశారు. విడపనకల్లు మండలం చీకులగురికికి చెందిన కజ్జి వనితమ్మకు రూ.2.50 లక్షలు, కడదరబెంచి అరుడప్పగారి రాజమ్మకు రూ.65 వేలు, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన సభావత్ సరోజాబాయికి రూ.3.50 లక్షల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట వరంగా మారిందని ఎమ్మెల్సీ తెలిపారు. అనంతరం లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'సంకల్పం' ఉంటే లక్ష్య సాధన

కూడేరు: ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని డీవైఈఓ శ్రీనివాస రావు సూచించారు. సోమవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, పిల్లల హాజరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయుడుగా మారి గణితంలో పలు ప్రశ్నలు వేసి పిల్లల నుంచి సమాధానాలు రాబట్టారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేసి అందరూ అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులకు ఆయన ఆదేశించారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఓబుళపతి, పీడీ అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం



రాయదుర్గం: వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



బొమ్మనహాళ్: శ్రీరాముడి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి తదితరులు

సాక్షి నెట్‌వర్క్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. శ్రీరామ దేవాలయాలు, ఆంజనేయస్వామి, ఇతర దేవాలయాలు భక్తులతో కిటకటలాడాయి. శ్రీరాముడి చిత్రపటాన్ని భక్తిపాటలు ఆలపిస్తూ భజనలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. జై శ్రీరాం నినాదాలతో కూడిన తోరణాలు , ఫ్లెక్సీలు కట్టి భక్తిని చాటుకున్నారు. పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



బెళుగుప్ప: సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



వజ్రకరూరు: సీతారామ విగ్రహాల ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న మహిళలు, యువతులు

సీఎం సభ విజయవంతం చేయండి

బెళుగుప్ప/వజ్రకరూరు: నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేసేందుకు మంగళవారం ఉరవకొండకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బెళుగుప్ప మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. సోమవారం బెళుగుప్ప ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి సీఎం పర్యటన విజయవంతంపై మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి నేతృత్వంలో నిర్వహించే సభకు మండలం నుంచి 120 బస్సులు ఏర్పాటు చేశామన్నారు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కరుణాకర్, నాయకులు రాజగోపాల్, రమేష్ పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరులో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడతూ ఉరవకొండలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్‌ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు తప్పనిసరి

కూడేరు: పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. కూడేరు మండలం గొటుకూరు, కమ్మూరు, మరుట్ల, ,జలిపల్లి, ఉదిరిపికొండ, కొర్రకోడు, ముద్దలాపురం, అరవకూరు, కొర్రకోడు డ్యాం, శివరాం పేట, కూడేరు గ్రామాల్లోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. గదుల్లో వెలుతురు, విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సౌలభ్యంపై ఆరా తీశారు. మౌలిక వసతుల్లేని బూత్‌లను గుర్తించి వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రూ.10 లక్షల పట్టివేత

విడపనకల్లు: ఆంధ్ర సరిహద్దులో విడపనకల్లు మండలం హావళిగి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షల నగదు పట్టుబడింది. వివరాలను సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప వెల్లడించారు. సోమవారం ఉదయం కర్ణాటక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని హావళిగి చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టు సిబ్బంది, పాల్తూరు పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి దాఖలాలు లేకుండా తరలిస్తున్న రూ.10 లక్షలు బయటపడింది. నగదు తరలిస్తున్న కర్ణాటకకు చెందిన చాకలి వీరభద్రప్పను అదుపులోకి తీసుకున్నారు. నగదుతో పాటు వాహనాన్నీ సీజ్ చేశారు. తనిఖీల్లో పాల్తూరు ఎస్ఐ తిప్పయ్య, ఎక్సైజ్ ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ ఉద్యోగులు

రాయదుర్గం/కంబదూరు/కళ్యాణదుర్గం: డిమాండ్ల పరిష్కారం కోరుతూ 41 రోజులుగా సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం విధుల్లో చేరారు. రాయదుర్గం, కణేకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 319 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఏడు ఖాళీలు మినహా మిగిలిన 312 మంది ఉద్యోగులు విధుల్లో చేరుతున్నట్లు ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు ప్రభావతి, యల్లమ్మకు జాయినింగ్ లెటర్లు సమర్పించారు. కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తామన్నారు. అలాగే కంబదూరు ప్రాజెక్ట్ పరిధిలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాల్లో 197 మంది కార్యకర్తలు, 179 మంది హెల్పర్లు సోమవారం విధుల్లోకి చేరినట్లు సీడీపీఓ వనజ అక్కమ్మ తెలిపారు. కళ్యాణదుర్గం పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు 175, హెల్పర్లు 137 మంది విధులకు హాజరైనట్లు సీడీపీఓ లక్ష్మీ ప్రసన్నతెలిపారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య



ముస్లిం మత పెద్దలతో చర్చిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సోషల్ మీడియా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ, కళ్యాణదుర్గం పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని సోషల్ మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై సోషల్ మీడియా ఫోకస్ పెట్టాలన్నారు. గత టీడీపీ హయాంలో పాఠశాలల స్థితి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధిని తెలిపేలా నాడు- నేడు వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రజల అభిప్రాయాలతో పోస్టులు పెట్టాలన్నారు. వ్యక్తిగతంగా కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు చేయకుండా పార్టీ అభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడేలా మనం చేసిన అభివృద్ధిని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, నాయకులు గోళ్ల సూరి, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, సోషల్ మీడియా ప్రతినిధులు షేక్షావలి, ఇబ్రహీం, నవీన్, ఉమేష్ రెడ్డి, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ యల్లనూరు ప్రసాద్ తదితరులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా గతంలో టీడీపీ తమను ఎంతో అవమాన పరిచిందని, వృత్తిని గౌరవించలేదని వారు వాపోయారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభల్లో తమ కులానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం వాయిద్య కళాకారులకు ఎంపీ గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాద్రి, స్థానిక అధ్యక్షుడు రవి, నాయకులు మోహన్ ప్రకాష్, మల్లికార్జున, యోగానంద, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో మసీదు నిర్మాణం

కళ్యాణదుర్గం: పట్టణంలోని మారెంపల్లి కాలనీలో ఉన్న మజీద్–ఏ–ఆజం మసీదు నిర్మాణానికి ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య నిధులు కేటాయించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ముస్లిం మత పెద్దలు ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మసీదు నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ఎంపీని ముస్లిం మత పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, యాసీన్, డీలర్ ఇబ్రహీం, ఎస్ఎం బాషా బేకిరీ దాదా, ఫక్రుద్దీన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం: అర్బన్, రూరల్ పీఎస్ కార్యాలయాల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా ఎం.శ్రీనివాసులు, జే ప్రసాద్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం, పుట్టపర్తి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి వారు బదిలీపై వచ్చారు. ఇప్పటిదాక విధుల్లో ఉండే అర్బన్ సీఐ లక్ష్మన్న చిత్తూరుకు, రూరల్ సీఐ యుగంధర్ పెనుగొండకు బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం వారు మాట్లాడుతూ రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికల ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం వారికి ఆయా మండలాల ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



సీఐలు శ్రీనివాసులు, ప్రసాద్‌బాబు, చంద్రశేఖర్

కళ్యాణదుర్గం రూరల్ సీఐగా చంద్రశేఖర్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రూరల్ స్టేషన్ సీఐగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సుధాకర్ బదిలీ అయ్యారు. నూతన సీఐ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. అసాంఘిక చర్యలు పాల్పడితే ఎంతటి వాళ్లైనా ఉపేక్షించేది లేదన్నారు. కాగా కళ్యాణదుర్గం రూరల్ స్టేషన్ అప్‌గ్రేడ్ కావటంతో ఉన్నతాధికారులు సీఐని నియమించారు.

'దుర్గం'లో మహిళల ఓట్లే కీలకం

కళ్యాణదుర్గం: 2024 ఎన్నికల్లో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి. ఎన్నికల అధికారులు సోమవారం రాత్రి సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,27,438 ఓట్లు ఉండగా ఇందులో మహిళల ఓట్లు 114236, పురుషుల ఓట్లు 113195 ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్ లెవెల్, తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాలలో సరిచూసుకోవచ్చని ఆర్డీఓ రాణి సుస్మిత తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

కళ్యాణదుర్గం: ధార్వాడలోని కర్ణాటక యూనివర్శిటీలో కర్ణాటక ప్రభుత్వం యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి.గోవర్ధన్ ఎంపికయ్యాడు. స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకట శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

బెళుగుప్ప: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్ర అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్రీడాసామాగ్రి కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ పుష్పావతి, ఏపీడీ రమేష్‌నాయక్, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభతో నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడా జట్లకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, హాకీ క్రీడా సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు.

నేడు ఆల్ట్రా మారథాన్ రన్

కుందుర్పి: ఆర్డీటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆల్ట్రా మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్లు ఏటీఎల్ నారాయణస్వామి సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం కుందుర్పిలోని ఫాదర్ ఫెర్రర్ ఆలయం నుంచి నిజవల్లి, జంబుగుంపల, కెంచంపల్లి, మహంతపురం వయా ఎనుములదొడ్డి మీదుగా కంబదూరు మండలానికి వెళతారన్నారు. 120 మంది స్పెయిన్ బృందం పాల్గొంటుందరన్నారు. కుందుర్పిలో ఆర్డీటీ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్, మాంచోఫెర్రర్, విశాలా ఫెర్రర్ జెండా ఊపి మారథాన్ రన్ ప్రారంభిస్తారన్నారు.


స్వాగతం-సుస్వాగతం
Hearty Welcome Sir
4వ విడత
YSR ఆసరా నిధుల
విడుదల కోసం
నేడు ఉరవకొండ
పట్టణమునకు విచ్చేస్తున్న
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి గారికి
మా హృదయపూర్వక
స్వాగతం-సుస్వాగతం.
ఈ కార్యక్రమంలో
ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం
చేయవలసినదిగా కోరుకుంటూ...
తేది :
23-01-2024 మంగళవారం
ఉ॥ 11-00 గం॥
వేదిక : అనంతపురము హైవే,
భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కన,
ఉరవకొండ
గౌ॥ శ్రీ వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు
ముఖ్యమంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్
గౌ॥ శ్రీ వై. శివరామిరెడ్డి గారు
MLC
అనంతపురము జిల్లా.
వై. భీమిరెడ్డి
YSRCP యూత్ నాయకులు, కొనకొండ్ల, ఉరవకొండ నియోజకవర్గం